ప్రజాశక్తి

శనివారం 14 అక్టోబర్ 2023 8 పేజీలు



గుంటూరు


పల్నాడు

పల్నాడులో 2.40లక్షల ఎకరాలు ఖాళీ



అప్రకటిత కోతలతో పంటలెండుతున్నాయి

ముప్పాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి-ఈపూరు

అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యవసాయ బోర్లు, మోటార్ల కింద సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. శుక్రవారం మండలంలోని గోపువారిపాలెం, చిట్టాపురం, ఎ ముప్పాళ్ళ గ్రామ రైతులు ముప్పాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా నాలుగు గంటలు కూడా ఇవ్వటం లేదన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు కాలువ నీరు రాకపోవడంతో వ్యవసాయ బోరు మోటార్ల కింద పంటలు సాగు చేశామని, తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు మరమ్మతులు గురవుతున్నాయని పంటలపై లక్షల రూపాయల పెట్టుబడి పెట్టామని వాపోయారు. వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని రైతుల కోరారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని విద్యుత్ సిబ్బంది తెలియజేయడంతో రైతులు ఆందోళన విరమించారు.



- ఖరీఫ్‌లో ఏ పంటా వేయకుండా వదిలివేసిన రైతులు
- సాగుచేసిన ప్రాంతాల్లో బెట్టకు వస్తున్న పైర్లు
- మిర్చి రైతులకు నీటి కష్టాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాను వర్షాభావం వెంటాడుతోంది. గతనెలలో వర్షాలు ఆశాజనకంగా ఉన్నా అక్టోబరు నెలలో ఇప్పటి వరకు వర్షాలు లేక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. కాల్వల్లోకి పూర్తిస్థాయిలో నీరు రాక, చాలినంత వర్షాలు లేక పంటలు బెట్టకు వస్తున్నాయి. ప్రధానంగా వరి ఎదుగుదల దశలో ఉంది. జులైలో సాగు చేసిన ప్రాంతాల్లో పొట్టదశలో ఉంది. ఈ నేపథ్యంలో గత 15 రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిర్చికి కూడా నీటి కష్టాలు ప్రారంభం అయ్యాయి. పత్తి పూత దశకు చేరుకుంటోంది. జూన్‌లోనే సాగు చేసిన ప్రాంతాల్లో కాయలు ఏర్పడుతున్నాయి. నీటి ఎద్దడితో పైరు ఎదుగుదల ఆశించిన స్థాయిలో లేదని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో లేకపోవడంతో బోర్లు కింద సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు అడుగుల వరకు ఉండాల్సిన పత్తిమొక్కలు చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ రెండు అడుగుల్లోనే ఉండిపోయాయి. పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 5.12 లక్షల ఎకరాల్లో పంటలుసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరకు 2.72 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగింది. ఇంకా 2.40 లక్షల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. ఖరీఫ్ సీజన్ ముగిసినా రెండున్నర లక్షల ఎకరాల్లో ఎటువంటి పంటలు వేయకుండా ఖాళీగానే ఉంచారు. పల్నాడు జిల్లాలో వరి,పత్తి సాగు గణనీయంగా తగ్గింది. పల్నాడు జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 20 వేల ఎకరాల్లోనే వేశారు. 3.05 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా కాగా కేవలం లక్షా 50వేల ఎకరాల్లోనే సాగుజరిగింది. 1.30 లక్షల ఎకరాల్లో మిర్చిసాగు చేయాల్సి ఉండగా 60వేల ఎకరాల్లో సాగు

2 లో


మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

ప్రజాసమస్యలు పరిష్కరించండి

సిపిఎం ప్రజా రక్షణ భేరీలో పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో పేరుకుపోయి ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో సిపిఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరీ' పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాదయాత్ర పట్టణంలోని 17, 19, 20, 21, 22 వార్డులలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం బృంద నాయకులను వార్డుల్లో ప్రజలు పలు సమ్యలను విన్నవించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి పన్నులు పెంచుతున్నారని అన్నారు. 5 సంవత్సరాలకు ఒకసారి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆస్తి పన్ను ఎంత పెంచాలో చర్చించి తీర్మానం చేసి పెంచుకోవడం జరుగుతుందని, కానీ దానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ప్రతి సంవత్సరం 15శాతం ఆస్తి పన్ను పెంచి వసూలు చేయడం అన్యాయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, అప్పుడు జరిగిన విద్యుత్ ఉద్యమం ఫలితంగా ఆ తర్వాత వచ్చిన ఏ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సాహసించ లేదని అన్నారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2014 నుండి 19 వరకు ట్రూ ఆఫ్ చార్జీలు, 2019 నుండి 22 వరకు సర్దుబాటు చార్జీలు, ఇప్పుడు ప్రతినెలా సర్దుబాటు చార్జీలు, కస్టమర్ చార్జీలు, విద్యుత్ సుంకం పేరుతో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచేశారని అన్నారు. విద్యుత్ బిల్లులు రెట్టింపు వస్తున్నాయని దీంతో ప్రజానీకం బెంబేలెత్తుతున్నారన్నారు. కేంద్రం లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో గ్యాస్ రూ. 450 ఉండగా దఫ దఫాలుగా పెంచుతూ ప్రస్తుతం రూ.వెయ్యి చేరుకున్నదని అన్నారు. రాష్ట్రంలోని అధికార వైసిపి ప్రతిపక్ష టీడీపీ పార్టీలు మౌనం వహిస్తున్నాయని అన్నారు. ఈ విధానాలతో నిరంతరం ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ దుర్మార్గాలను ప్రజలకు తీసుకువెళ్లేందుకు సిపిఎం పాదయాత్ర చేపట్టిందని అన్నారు. ఈ పాదయాత్ర ఈనెల 13 నుండి 31 వరకు జరుగుతుందని

2లో

అక్రమ రవాణాను అరికడదాం

14500కు సమాచారం ఇస్తే తక్షణం స్పందిస్తాం : ఎఎస్‌పి

ప్రజాశక్తి-తెనాలి

ప్రమాదకరమైన మారకద్రవ్యాలు, నార్కోటిక్ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డిఎం మహేష్ చెప్పారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌తో రైళ్ళలో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జిఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది, డిఎస్పీ బి.జనార్ధనరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గతంలో మాదిరి పెద్దమొత్తంలో ఏ సరకూ రవాణా కావటంలేదని, చిన్న మొత్తాల్లో తెలివిగా అక్రమ రవాణాకు దుండగులు పాల్పడుతున్నారన్నారు. విశాఖపట్టణం పరిసర ప్రాంతాల్లో లభించే గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని, దాని రవాణాకు సులువైన మార్గంగా రైళ్ళను

2లో


రైలులో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహమ్మద్ చిష్టీ, గుంటూరు విజయ్ కుమార్ తదితరులు

19న పల్నాడు జిల్లాలో మైనార్టీల రాష్ట్ర సదస్సు

జయప్రదం చేయాలని నాయకులు పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావుపేటలో కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో 19వ తేదీన నిర్వహించే మైనార్టీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మైనార్టీల రాష్ట్ర నాయకులు ఎంఎ చిష్టి కోరారు. శుక్రవారం పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సిపిఎం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో చిష్తి మాట్లాడారు. ఎపిలో మైనార్టీల పట్ల సిపిఎం వైఖరి, మైనార్టీల సమస్యలపై సిపిఎంఅధ్యయనం చేసిన అంశాలపై క్షేత్ర స్థాయిలో రాష్ట్ర స్థాయి సదస్సులో చర్చిస్తామన్నారు. మైనార్టీలలో ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను దూరం చేయడం వంటి అనేక అంశాలపై రాష్ట్ర స్థాయి మైనార్టీ సదస్సులో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేస్తామన్నారు. మైనార్టీల అభివృద్ధి రక్షణ మరియు లౌకికవాద పునరుద్ధరణకు సిపిఎం కృషి చేస్తుందన్నారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిటీల సిఫార్సులు అమలు చేయాలని, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ముస్లిం మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కల్పించాలని, దుల్హన్ పథకం ద్వారా ప్రతి ముస్లిం మహిళకు విద్యతో సంబంధం లేకుండా కనీసం రూ.1 లక్ష సహాయం అందించాలని తదతర హక్కుల కొరకు సిపిఎం పోరాడుతుందన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పేద ముస్లిం

2లో

16న ఎంటిఎంసి కార్యాలయం వద్ద ధర్నా

జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉద్యమాలు, పోరాటాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా వచ్చిన సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి ఈ నెల 16వ తేదీ మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయం ముందు జరిగే ధర్నాకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అధ్యక్షతన సమావేశంలో రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 20 వేల మందికి ఇళ్లపట్టాలు రావాల్సి ఉందని, ప్రభుత్వం వెంటనే వారికి ఇళ్లపట్టాలు ఇచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పేదలు వేలాది మంది వివిధ కాలనీలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. పెద్దఎత్తున పెరిగిన అపార్టుమెంట్లకు సరిపడా డ్రైనేజీ వ్యవస్థ లేదని, డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారి భవిష్యత్తులో రోడ్లను ముంచెత్తనుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ తీసుకొచ్చి సక్రమంగా

2లో


మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

19న పల్నాడు జిల్లాలో మైనార్టీల రాష్ట్ర సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఇంటి నిర్మాణం, ఇంటి స్థలాలు కమ్యూనిటీ హాలు, రాజధాని ప్రాంతంలో ఉర్దూ అకాడమీ, హజ్ హౌస్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్యక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ స్వాధీనం చేసుకొని ఆస్తుల పరిరక్షణకు చట్టాన్ని అమలు చేయాలని ప్రతి మండలంలో ఒక ఉర్దూ మోడల్ స్కూల్, ప్రతి నియోజకవర్గానికి ఒక ఉర్దూ కళాశాల, ప్రతి జిల్లాకు ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి, సహకారం అందించాలన్నారు. విదేశీ విద్యా పథకం పునరుద్ధరించి జనాభా ప్రాతిపదికన చట్టసభలో ప్రాతినిధ్యం, రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అర్హులందరికీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో జరిగే మైనార్టీ సదస్సులో ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిలా నాయకులు డి శివ కుమారి, మస్తాన్ వలి, హుస్సేన్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

16న ఎంటిఎంసి కార్యాలయం వద్ద ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

మురుగు నీరు పారుదల అయ్యేలా చూడాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో భుగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు వస్తే మురుగు రోడ్డుపైకి వచ్చి ఇబ్బంది పడుతున్న సంగతిని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. అంటురోగాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. దళితుల శ్మశాన సమస్య తీవ్రంగా ఉందన్నారు. దానిని వెంటనే పరిష్కరించాలని కోరారు. మంగళగిరిలో చేనేత పార్కు ఏర్పాటు చేసి నేతన్నల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. నేతన్నలు కూలీలుగా మారుతన్న దైనస్థితి నెలకొందని తెలిపారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని కాపాడాలన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు రాజధానిలో తగినంత మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. పారిశుధ్య కార్మికులపై పని భారం పెరిగిందని, రూ.15 వేలు జీతంతో పాటు రూ.6 వేలు మెడికల్ అలవెన్స్ కలిపి రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల మృతిచెందిన ఆశ వర్కర్ కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతికి కారణమైన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

పాదయాత్ర ముగింపు సందర్భంగా 31న సత్తెనపల్లి తాలూకా సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందని ఈ బహిరంగ సభలో ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పాదయాత్రను ప్రారంభించిన ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నులు, విద్యుత్ చార్జీలు, నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెంచి భారాన్ని మోపుతున్నారని అన్నారు. ఈ విధానాలను ప్రజానీకమంతా ఐక్యమై తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే పోరాటాలలో ప్రజానీకం అంతా భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల మాట్లాడుతూ పట్టణంలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి మురుగు ఒక్కడే పేరుకుపోయి ఉందని వెంటనే మురుగు కాలువలు పూడికలు తీయించాలని ఆమె డిమాండ్ చేశారు. సుందరయ్య కాలనీ పక్కనే ఉన్న వాగుపై వంతెన నిర్మించి వాగు సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. కొత్తపేట దళిత వాడలో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తే చెప్పులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నామని కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ రుణాలు మంజూరు చేయడం లేదని దీంతో తమ కుటుంబాలు బజార్లు పడుతున్నాయని వారు పాదయాత్ర దృష్టికి తీసుకువచ్చారు. పాదయాత్రలో సిపిఎం పలనాడు జిల్లా నాయకులు జి రవిబాబు, జి మల్లేశ్వరి, కట్టా శివ దుర్గారావు,ఎ వీర బ్రహ్మం, ఆర్ పురుషోత్తం,యం హరిపోతురాజు, పి ప్రభాకర్, జి ఆంజనేయులు ,పి రామారావు, షేక్ సైదులు, ఎ వెంకట్ నారాయణ, దామర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

మృతదేహాల తరలింపులో జాప్యం

అత్యవసర విభాగంలో మూడు గంటలపాటు కదలని వైనం

టిడిపి నేతల నిరసనతో స్పందించిన యంత్రాంగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స పొందుతూ శుక్రవారం స్వల్ప వ్యవధిలో మృతి చెందారు. ఈ ముగ్గురు మృత దేహాలను ఎక్కువ సేపు స్ట్రెక్చర్‌లపై అత్యవసర విభాగంలోనే ఉంచారు. మృత దేహాలను అక్కడే ఉంచి రోగులకు చికిత్సలు చేయడం కలకలం రేపింది. ఉదయం 9.07 నిమిషాలకు షేక్ సైదా(35), 9.30 గంటలకు కూచిపూడి ప్రవీణ్‌కుమార్ (53),10.07 గంటలకు ఎం.సురేష్ (50)చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇదే సమయంలో వార్డులో ఎక్కువమంది రోగులు అత్యవసర విభాగంలో ఉన్నారు. వీరంతా స్ట్రెక్చర్లపై రోగులను ఉంచి చికిత్సలు చేశారు. అత్యవసర విభాగంలో ఎన్నో సౌకర్యాలు పెంచామని అధికారులు చెబుతున్నా ఇప్పటికీ స్ట్రెక్చర్లపై ఉంచి చికిత్సలు చేయడం పరిపాటిగా మారింది. ఆస్పత్రి అత్యవసర విభాగంలో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని పరిశీలించేందుకు మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చిన టిడిపి నాయకులు నశీర్ అహ్మద్ మూడు మృతదేహాలను గంటల తరబడి అత్యవసర విభాగంలో ఉంచి పక్కవారికి చికిత్సలు చేయడాన్ని తప్పుపట్టారు. మూడు మృత దేహాలను 20 గంటలుగా ఇక్కడే ఉంచారని అధికారులపై మండిపడ్డారు. వైద్య రంగాన్ని ఎంతో గొప్పగా అభివృద్ధి చేస్తున్నామని సిఎం జగన్ చెబుతున్నా వైద్య సేవలు మాత్రం మెరుగుపడటం లేదన్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలలో తీవ్ర జాప్యం జరుగుతుందని నిరసన తెలిపారు. ఈ అంశంపై ఆర్ఎంవో సతీష్‌కుమార్ వివరణ ఇస్తూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్వల్ప వ్యవధి లో ముగ్గురు మతి చెందారని కేవలం ఎంఎల్‌సి కేసులకు సంబంధించిన శవాలను మాత్రమే మార్చురికి పంపుతామని మిగతా వాటిని సంబంధిత బంధువులకు అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహా ప్రస్థానం వాహనం ద్వారా మతదేహాలను వారి స్వస్థలానికి తీసుకు వెళ్లేందుకు అప్పగిస్తామని అన్నారు. మతదేహాలను సకాలంలో తరలించలేదని చెప్పడం అవాస్తవం అన్నారు. కొంతమంది ఆసుపత్రి పై బురద చల్లాలని ప్రయత్నాలు చేయడం సహేతూకం గా లేదన్నారు. రాజకియం కోసం ఆసుపత్రి ని అప్రతిష్ట పాలు చేయవద్దని అన్నారు.

ఓటుతో మంచివారిని ఎన్నుకోండి

అన్ని తరగతుల వారికి కాసరనేని సేవలు స్ఫూర్తిదాయకం

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో ప్రస్తుత రాజకీయాలు చూస్తుంటే చీదర వేస్తుందని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. గుంటూరులోని సిద్దార్థ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వెంకయ్య నాయుడు ప్రసంగిస్తూ ఇప్పటి రాజకీయాలలో చెడును కడిగివేయాలి, మహనీయులను ఎన్నుకోవాలన్నారు. మనం ఏం చేయలేం అనుకో కూడదు..ప్రతి ఒక్కరూ ఓటు ద్వారా మంచివారిని ఎన్నుకోవాలన్నారు. చదువుకున్న వారు రాజకీయాల్లోకి రావాలన్నారు. కులం, డబ్బు అండతో క్రిమినల్స్ రాజకీయాల్లో ఉన్నారని బూతులు మాట్లాడే వారికి పోలింగ్ కేంద్రాల్లో బటన్‌నొక్కి సమాధానం చెప్పాలన్నారు. సదాశివరావు లాంటి డాక్టర్‌లు ప్రజా సేవకొసమే వైద్య వృత్తి లో కొనసాగారని, విద్య, వైద్య, కళా, సాహిత్య రంగాల్లో ఆయన సేవలు మరువలేనివని అన్నారు. రాజకీయ రంగంలో కూడా ఆయన రాణించారని, నిజాయితీగా ఉన్నారని అన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడంలోఈ తరం వైద్యులకు సదాశివరావు ఎంతో స్ఫూర్తి దాయకం అన్నారు. కేవలం డబ్బు సంపాదించడమే లక్ష్యం



కాకూడదని,పేదలు, బడుగువర్గాలకు కూడా ఎంతో కొంత ఉచిత సేవలు చేసి కొంత అయినా ఆత్మ సంతృప్తి పొందాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా వైద్య, విద్యా, రాజకీయ రంగాలలో విశేష ప్రతిభ కలిగిన పలువురికి సేవ పురస్కారాలు ప్రదానం చేశారు. మాజీ ఎంపిలు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.వి.పి.రామచంద్రరావు, మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్, నన్నపనేని రాజకుమారి, విజ్ఞాన్ సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య, నిమ్స్ డైరక్టర్ ప్రసాదరావు, నాటక రచయిత రామారావు, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, దాసరి ప్రసాదరావు, ఉషాబాల, కాసరనేని కృష్ణవర్ధన్,వల్లీరాణి, పిన్నమనేని నారాయణరావు తదితరులు ప్రసంగించారు. సభలో కాసరనేని సదాశివరావు జీవత సాకల్యంపై పాతూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని, పోస్టల్ కవర్‌ను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తొలుత కాసరనేని సదాశివరావు చిత్రపటం వద్ద పలువురు ఘనంగా నివాళి అర్పించారు.

అక్రమ రవాణాను అరికడదాం

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఎంచుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో వాసనతో పసిగట్టేందుకు శిక్షణ పొందిన డాగ్స్ సిద్ధంగా ఉన్నాయని, రొటీన్‌గా ఆకస్మిక తనిఖీలు జరుగుతాయన్నారు. ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్నా అక్రమ రవాణాపై 14500 నెంబరుకు సమాచారం ఇవ్వాలని, సామచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. సమావేశంలో డిఎస్పీ బ.జనార్ధనరావు, స్టేషన్ సూపరింటెండెంట్ రమణ, ఎస్ఈబి సిఐ ఏవి చలం, ఆర్పీఎఫ్ సిఐ ఫతే ఆలిభేగ్, జిఆర్పీ సిఐ శ్రీనివాసరావు, టూటౌన్ సిఐ వెంకటరావు,పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో మెరిసిన వివేక విద్యార్థులు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో ఈనెల 11 వ తేదీన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ జిల్లా సెలక్షన్ పోటీలలో స్థానిక వివేకా జూనియర్ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదువుతున్న మైలా తేజస్విని అండర్ 17 క్యాటగిరీ విభాగంలో పోటీ పడి తన అసమాన ప్రతిభను చాటుకుంది. శుక్రవారం వివేక హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అభినందన సభలో మైల తేజస్వినినీ పొన్నూరు, బాపట్ల వివేక విద్య సంస్థల డైరెక్టర్ ఉప్పల సుకుమార్ బాబు సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ రెండు విభాగాలలో తేజస్విని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలబడి స్టేట్ మీట్‌కు అర్హత సాధించింది. పవర్ లిఫ్టింగ్ లో 110 కేజీ స్క్వాడ్ , 45 కేజీ బెంచ్ ప్రెస్ , 120 కేజీ డెడ్ వెయిట్ మొత్తం 275కేజెస్ లిఫ్ట్ చేయగా, వెయిట్ లిఫ్ నందు 47 కేజీ స్నాచ్, 52 కేజీ కీన్ అండ్ జర్క్ మొత్తం 99 కేజీలు లిఫ్ట్ చేసింది. బాక్సింగ్ పోటీలలో వివేకా హై స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న పసుపులేటి భరత్ 44 కేజీ కేటగిరిలో పాల్గొని ప్రథమ



స్థానంలో నిలిచి స్టేట్ మీట్ కి అర్హత సాధించాడు.ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఉప్పల సుకుమార్ బాబు విజేతలిద్దరికీ మెడల్ ట్రోఫీలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతిని కూడా అందించి అభినందించారు. ఉప్పల సుకుమార్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో కూడా వారి సత్తాని చాటుకునే విధంగా పోటీ పడాలి అని అన్నారు. ప్రతిభగల ఇలాంటి విద్యార్థులను వివేకా విద్యాసంస్థలు ఎప్పుడు ప్రోత్సహిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ బోసు, హైస్కూల్ ఇన్చార్జి సుబ్బారావు, పిఇటి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పల్నాడులో 2.40 లక్షల ఎకరాలు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

అయింది. 50 వేల ఎకరాల్లో కందిసాగు చేస్తారని అంచనావేయగా ఇప్పటి వరకు కేవలం 38 వేల ఎకరాల్లో వేశారు. సెప్టెంబరు నెలలో కురిసిన వర్షాలతోఒకే సారి కంది విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సెప్టెంబరు 20 వరకు కేవలం 19 వేల ఎకరాల్లోనే కంది సాగు చేయగా ఆ తరువాత గడచిన 20రోజుల్లోనే మరో 19 వేల ఎకరాల్లో కంది సాగు జరిగింది.వరి, పత్తి,మిర్చి కన్నా ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల కందిసాగు వైపు రైతులు ఎట్టకేలకు మొగ్గుచూపారు. మరో ఆరు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు.

మొత్తంగా గత ఏడాది ఇదే సమయానికి పల్నాడు జిల్లా మొత్తం మీద 4 లక్షల ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగు చేయగా ఈ ఏడాది వర్షాభావం వల్ల ఇప్పటి వరకు కేవలం 2.72లక్షల ఎకరాల్లోనే వేశారు. సెప్టెంబరు నెలలో విస్తారంగా వర్షాలు కురవడం వల్ల కొంత మేరకు మేలు జరిగినా తిరిగి అక్టోబరులో ఏర్పడిన వర్షాభావం వల్ల వేసిన పంటలు కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం సాగర్ కుడికాలవకు తాగునీటి పేరుతో నీటి విడుదల చేయడం వల్ల కొంత మంది రైతులు కాల్వల ద్వారా పంటలకు ఒక తడి కోసం ఉపయోగించు కోగల్గుతున్నారు.

15న నేత్రదాత శివయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి-తెనాలి

నేత్రదాత, త్యాగశీలి రావూరి శివయ్య ప్రథమ వర్ధంతి సభ ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక కవిరాజ పార్క్ లోని సీనియర్ సిటిజన్స్ భవన్లో నాస్తిక సమాజం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం కార్యదర్శి రావూరి శివకష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా 'మహిళా సాధికారత-మహిళా రిజర్వేషన్లు-పరిశీలన' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని, సదస్సులో ముఖ్య వక్తగా ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వ సంపాదకులు కె ఉషారాణి ప్రసంగిస్తారన్నారు. అలాగే 'భారత సాంస్కృతిక చరిత్ర-సనాతన ధర్మం' అంశంపై నిర్వహించే సదస్సులో ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ ప్రసంగిస్తారన్నారు. ప్రజాస్వామ్యవాదులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యువత దేశభక్తి కలిగి ఉండాలి

కెఎల్ యు డీన్ డాక్టర్ సిహెచ్.హనుమంతరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నేటితరం యువత దేశభక్తి కలిగివుండి, సమాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు విద్యార్థులకు సూచించారు. వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం' మేరీ మట్టి మేరీ దేశం' కార్యక్రమంలో బాగంగా కలశ యాత్రను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మేరీ మట్టి మేరీ దేశ్ అనే కార్యక్రమానికి ప్రదాని మోది ఇచ్చిన పిలుపుకు దేశ వ్యాప్తంగా యువత నుండి విశేష స్పందన లభించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి మట్టి, బియ్యంను సేకరించి ఎన్.సి.సి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులతో కలిసి కలశ యాత్ర నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, అడ్వైజర్స్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ హబీబుల్లాఖాన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఎన్.సి.సి ఆఫీసర్లు మౌనిక, పావని, హాబీ క్లబ్ ఇంచార్జి డాక్టర్ ఆర్.సుభాకర రాజులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ, బాలిక మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో మహిళ, బాలిక బాలిక మృతి చెందిన ఘటన పట్టణ శివారు ప్రాంతంలోని మెడికల్ కాలేజీ సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పట్టణ సీఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని న్యూవెల్లంపల్లి గ్రామానికి చెందిన పోతు రాజు వెంకటేశ్వర్లు, తన చిన్న కుమార్తె హర్షితకు టైఫాయిడ్ జ్వరం రావడంతో ఇంజక్షన్ చేయించేందుకు బ్రాహ్మణపల్లి కి ద్విచక్రవాహనానంపై బయలుదేరాడు. తన పెద్ద కూతురు లక్ష్మీ తేజస్విని కూడా తీసుకొని వెళు ండగా.. వరు సకు అక్కయ్య అయిన కారు కోళ్ల సంపూర్ణ తన పొలం పని నిమిత్తం వెళుతూ తనను కూడా మెడికల్ కాలేజీ వద్ద దింపమని అడిగింది. వాహనంపై మెడికల్ కాలేజీ వైపు వెళుతుండగా బ్రాహ్మణపల్లి అడ్డరోడ్డు దగ్గర అతివేగంగా వస్తున్న లారీ వెనక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సంపూర్ణ(45), లక్ష్మి తేజస్విని (6) అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటేశ్వర్లు, హర్షితకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంకటేశ్వర్లను, హర్షితను చికిత్స నిమిత్తం వైద్య శాలకు తరలించారు. ప్రమాద జగిరన సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ రబ్బాని,సిఐ వీరాంజనేయులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు



కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 21,315
మిర్చి ఎగుమతి	: 23,379
మిర్చి నిల్వ	: 7,216

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,000
నెం.5	15,700 - 20,000
273	14,000 - 18,000
341	15,000 - 23,000
	నాన్ ఎసి
తేజ	9,500 - 24,000
బడిగి	10,000 - 25,000
దేవనూరు డీలక్స్	10,200 - 17,500
తాలుకాయలు	6,200 -14,500
	ఎసి
334	15,000 - 21,000
273	20,500 - 21,000
341	15,000 - 21,500
తేజ	10,500 - 23,500
బడిగి	16,000 - 24,000
తాలుకాయలు	6,000 -13,000

నేడు, రేపు ఎస్సై రాత పరీక్షలు.. పటిష్ట బందోబస్తు



ప్రజాశక్తి-గుంటూరు సిటి

నేడు, రేపు రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా గుంటూరు రేంజ్ పరిధిలో జరగనున్న ఎస్సై తుది రాత పరీక్షలకు శుక్రవారం స్థానిక పోలీస్ పరిధి గ్రౌండ్ మైదానంలో రేంజ్ ఐజి బాలరాజు ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ అరిఫ్.ఆఫీజ్ పర్యవేక్షణలో పరీక్షల నోడల్ అధికారి గా ఉన్న అడిషనల్ ఎస్పీ సుప్రజ పోలిస్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, పరీక్షల బందోబస్తు లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 7145 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవ్వనున్నారని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు అవుతుందన్నారు . ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద మహిళా పోలీసులు వుండే విధంగా చర్యలు తీసు కుంటున్నామన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలని, హాల్ టికెట్ , ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలకు అనుమతి లేదన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని అభ్యర్థుల ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, శ్రీనివాసరావు , ఎఎస్పి నిసికేట్ సెల్కి , డీఎస్పీలు ఉమామహేశ్వర రెడ్డి , మహబూబ్ బాషా , బాల సుందర రావు , రామారావు ప్రకాష్ బాబు , చంద్ర శేఖర్‌రావు, సిఐ లు బాలసుబ్రమణ్యం , శ్రీనివాసరావు సుధాకర్ , ఆర్ ఐలు రాజారావు థామస్ రెడ్డి రమేష్ కష్ణన్ , యస్ ఐ వెంకట కష్ణ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై విచారణ కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలో లైంగిక వేధింపులు పై విచారణ కోసం డివిజనల్ స్థాయి అంతర్గత ఫిర్యాదు కమిటీలో విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు నందేటి అపూర్వను నియమితులయ్యారు. ఆమె నియా మకంపై జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌కు విముక్తి ప్రధాన కార్యదర్శి పుష్పావతి, ఉపాధ్యక్షురాలు బాజీవలి, సంయుక్త కార్యదర్శి మౌనిక, లావణ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ డివిజనల్ స్థాయి అంతర్గత విచారణ కమిటి జిల్లాలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిపై వచ్చే లైంగిక వేధింపుల ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలకు తగు సిఫార్సులను ఆ శాఖ జిల్లా స్థాయి అధికారులకు చేయడం జరుగుతుందన్నారు.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-గుంటూరుసిటి: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకెసి కాలేజ్ రోడ్డులో పేకాట స్థావరాలపై ఎస్ఐ ఏడుకొండలు శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. రియల్ ఎస్టేట్ ఆఫీస్ లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 9 సెల్ ఫోన్లతో పాటు సుమారు రూ.39 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.



జాతీయస్థాయి పోటీలకు నందిగామ జెడ్‌పి విద్యార్థినులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పుట్ బాల్ రాష్ట్ర స్థాయి జుట్టుకు నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య శుక్రవారం తెలిపారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో అక్టోబర్ 7నుండి 9 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని గుంటూరు జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పచ్చా తిరుమల వెంకట హరిప్రియ, నల్లగొండ రమ్యలు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు చెప్పారు. తిరుమల వెంకట హరిప్రయ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస రావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ దార్ల చిట్టెమ్మ బాబు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. డిసెం బర్ చివరి వారంలో పంజాబ్ లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పిచ్చయ్య తెలిపారు.



రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు గీతమ్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-వినుకొండ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి మండలం నిడమర్రు జడ్పీహెచ్ హైస్కూల్లో జరిగినటు ఆటల పోటీల్లో గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు అండర్-14 ఖో ఖో పోటీలలో ఎం. వెంకట అభినాష్ రెడ్డి , అండర్ 17 ఖో ఖో పోటీలలో ఎస్. ప్రమోద్ ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. చిత్తూరులో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో వీరు పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు గీతమ్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు సూర్య ప్రకాష్, సాల్మన్ రాజు, అంజిరెడ్డి, వీరాంజనేయులు, గోపి, పృథ్వి పాల్గొన్నారు.



క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో దసరా సంబరాలు

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ముందుస్తు దసరా సంబరాలను నిర్వహించారు. నవరాత్రులను పురస్కరించుకుని స్కూల్ ఆవరణలో విద్యార్థులతో రోజు వారి అలంకరణలో భాగంగా చిన్నారులతో అమ్మవార్ల వేషధారణ నిర్వహించారు. అనంతరం టీచర్ల, విద్యార్థులు బతకమ్మ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ కల్ప శ్రీ

ప్రజాశక్తి -అమరావతి

బాలికల హక్కులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్ప శ్రీ కోరారు. శుక్రవారం గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టం పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంస్థ కో ఆర్డినేటర్ తండు లక్ష్మణ్ వహించారు. ఈ సందర్భంగా కల్పశ్రీ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించడానికి వారి తల్లి దండ్రులు సహకరించాలన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకొని వాళ్ల కాళ్ళపై వాళ్ళు నిలబడితే కట్నం ఇవ్వాల్సిన అవసరం ఉండదని అన్నారు. తన తల్లిదండ్రులు తాను కలెక్టర్ కావడానికి పూర్తి సహకారం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. తాను మొదట సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసే దానినని, తన తండ్రి కోరిక మేరకు ఆ జాబ్ మానేసి యూపీఎస్సీ చదివి కలెక్టర్ అయ్యానని అన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని, చదవాలనే ఆకాంక్ష ఉండాలని అన్నారు. పిల్లలకు ఇష్టమైన సబ్జెక్టులని తల్లిదండ్రులు చదివిం చాలన్నారు. అనంతరం పల్లోటి జూనియర్ కాలేజ్ డైరెక్టర్ ఫాదర్ భాస్కర్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బత్తుల విజయ , గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ డైరెక్టర్ సిస్టర్ విన్నారాసి మాట్లాడారు. కార్యక్రమంలో సిస్టర్ డియానా , అగస్టీన్ స్కూల్ సుపీరియర్ సిస్టర్ ప్రియా, సిస్టర్ గ్రేసి, సిస్టర్ మార్టినా, రిటైర్డ్ ఏ ఈ కూచిపూడి రవి శేఖర్ పాల్గొన్నారు.

కాకాని అప్పారావుకు జాషువా ప్రతిభా పురస్కారం



ప్రజాశక్తి-వినుకొండ

ఎస్సీ, ఎస్టీ ఆరోగ్య మిత్రాల రాష్ట్ర కార్యదర్శి కాకాని అప్పారావుకు గుర్రం జాషువా ప్రతిభా పురస్కారాన్ని శుక్రవారం అందజేశారు. నవ యుగ కవి చక్ర వర్తి గుర్రం జాషువా 128 వ జయంతి వేడుకలలో భాగంగా స్థానిక జాషువా కళా ప్రాంగణంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఈ పురస్కారం ఆయనకు అందజేశారు. తిరుమల నర్సింగ్ హోమ్ లో పని చేస్తున్న అప్పారావు సేవలను గుర్తించి ఈ ప్రతిభా పురస్కారము ఆయనకు దక్కింది. ఈ సందర్భంగా అప్పారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఆరోగ్య మిత్ర ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి మాట్లా డుతూ జాషువా తన కవిత్వం ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేశారని కొనాడారు. కార్యక్రమంలో జాషువా కళా సాంస్కృతిక సంఘం అధ్యక్షులు చిలకల జాన్ సుందరరావు, భాగవతుల రవికుమార్, కమలా రామ్, ప్రముఖ న్యాయవాది పి.జాన్ లూకా , ప్రముఖ కళాకారుడు మందా వెంకటరావు, పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

4వ సెమిస్టర్ ఫలితాల్లో 'వాగ్దేవి' విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ 4 వ సెమిస్టర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు బి.ఎస్.సి, బికాం విభా గాలలో ఉత్తమ మార్కులతో పట్టణ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంపై వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, వాగ్దేవి కళాశాలల సెక్రటరీ, కర స్పాండెంట్ రాయల శ్రీనివాసరావులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ఎంపిసి విభా గంలో ఎస్.దివ్య 900 మార్కులకు గాను 858, సిహెచ్ భవాని 785 మార్కులు, ఎంపిసిఎస్ లో పి.పావని 900 మార్కులకు గాను 850, బి.లక్ష్మీ ప్రసన్న 847, పి.లక్ష్మీ 840 మార్కులు సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎం.ఎస్.సి.ఎస్ విభాగంలో ఎం. శ్రావణి 900 మార్కులకు గాను 853, పి.భాగ్య లక్ష్మి 813, బి.నీరజ 803 మార్కులు సాదించగాబికాం విభాగంలో 800 మార్కులకు గాను వి.తిరుపతమ్మ 702, వి.నవ్య 693, బి.లావణ్య, డి.రమ్య,టి.నీరజలు 677 మార్కులు సాధిం చారన్నారు. అన్ని సబ్జెక్టు లలో 90శాతం పైగా మార్కులు సాధించడంతో పాటు మ్యాథ్స్, ఫిజిక్స్,స్టాటిటిక్స్ లలో 100 మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థుల ను అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్ కె.రామ కోటే శ్వరరావు, వి.నాగేశ్వరరావు, ఎం. కోటేశ్వ రరావు, ఎస్ సురేష్ బాబు, పి.కృష్ణారావు, ఇస్కెపల్లి కృష్ణకిషోర్ ఉన్నారు.

న్యాక్ బృందం పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట చిలకలూరిపేట రోడ్డులోని ఎస్.ఆర్.కె.టి కాలనీ వద్ద ఉన్న కృష్ణవేణి డిగ్రీ కళాశాలను గురు, శుక్రవారాలలో కష్ణవేణి డిగ్రీ కళాశాలను క్షేత్ర స్థాయిలో పరి శీలించారు. ఈ సందర్భంగా కళాశాలకు విచ్చేసిన న్యాక్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ చింతమనేని మీనా, న్యాక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ హరి భజన్ బన్సల్, న్యాక్ సభ్యులు ప్రొఫెసర్ అజయ్ అగర్వాల్,కృష్ణవేణి డిగ్రీ కళాశాలను సందర్శించేందుకు వచ్చిన బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు,డైరెక్టర్ లు మెదరమెట్ల రామ శేషగిరిరావు, కోమటినేని నాసరయ్య లు ఘనంగా స్వాగతం పలికారు. న్యాక్ బందం కళా శాలలోని బోధన ప్రమాణాలను కంప్యూటర్ ల్యాబ్స్, అత్యాధునిక ప్రయోగశాలను, క్రీడా ప్రాంగణాన్ని, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాల పనితీరుపై క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యం కు సం బంధించి పలు ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్

గురజాల, దాచేపల్లి తహాశీల్దార్ కార్యాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గురజాల, దాచేపల్లి తహాశీల్దార్ కార్యాలయంన్ని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. రీ- సర్వే 3 ఫేజ్ , అసైన్ మెంట్స్ భూములు, విలేజ్ సర్వే ఇనాము, ముటేషన్స్ లో తప్పు లను సరిచేయటం, మూటేషన్స్ లో ట్రాన్స్ క్షన్స్, సబ్- డివిజన్లు, ఎఫ్- లైన్ పిటిషన్స్, లాండ్ కన్వరషన్, అగ్రకల్చర్ లాండ్, నాన్ అగ్రికల్చరల్ లాండ్స్ పనులు సక్రమంగా అమలు చేయాలి అని అన్నారు. గురజాల ఆర్.డి.ఓ అద్దెయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పంచాయతి అధికారి విజయభాస్కర్ రెడ్డి

నకరికల్లు పంచాయతి కార్యాలయాన్ని పరిశీలించిన ఐఎస్ఓ

ప్రజాశక్తిలి-నకరికల్లు

నకరికల్లు పంచాయతి కార్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఐఎస్ఓ, కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ బీతు బాలకృష్ణన్ శుక్ర వారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలకృష్ణన్ మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53 పంచాయతిలను ఎంపిక చేశా మన్నారు. అలాగే, పల్నాడు జిల్లాలో నకరికల్లు యడ్లపాడు పంచా యతిలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ ఎంపిక గురించి పంచాయతీ నిర్వ హించాల్సిన రికార్డులు, వనరులు, పరిపాలనా లభ్యతపై సూచ నలు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతి అధికారి విజయ భాస్కర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బాలు నాయక్, ఎంపిడిఓ బండి శ్రీనివాస్ రెడ్డి, ఇఓపిఆర్డి గిరిధర్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో జట్లకు ఈపూరులో శిక్షణ

ప్రజాశక్తి-ఈపూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖో ఖో పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జూనియర్, సబ్ జూనియర్ జట్లకు మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శిక్షణ ఇస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి తెలిపారు. జూనియర్ విభాగంలో 15 మంది, సబ్ జూనియర్ విభాగంలో 20 మంది విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎ వీరాంజనేయులు,ఎం వెంకటేశ్వర్లు 10 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనం తరం ఈ నెల 20, 21, 22వ తేదీలలో చిత్తూరు జిల్లాలోని రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలలో విద్యార్థులు తలపడనున్నారు.

16వ తేదీకి నవోదయం వాయిదా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి అవకాశాలు కల్పన నిమిత్తం ప్రతి నెలా 14వ తేదీన నిర్వహించే నవోదయం కార్యక్రమాన్ని ఈ నెల 16కు వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం నవోదయం నోడల్ అధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 16 వ తేదీ ఉదయం10 నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఆయా రంగాల్లో ఉపాధి మార్గాలు అవకాశాలు కోసం వచ్చే యువత 16న హాజరు కావాలని తెలిపారు.

ఈవిఎంలకు ఫస్ట్ లెవల్ చెకింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికలకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లను సిద్ధం చేసేందుకు ఫస్ట్ లెవల్ చెకింగ్ నిర్వహించే బెల్ ఇంజినీర్లకు సహాయంగా నియమించిన ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్సీ)కి విధులు కేటాయించిన ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ఈవీఎంలు, వీవీప్యాట్ లకు అక్టోబరు 16వ తేదీ నుంచి రెవెన్యూ కళ్యాణ మండపంలో బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజనీర్లు ఫస్ట్ లెవల్ చెకింగ్ నిర్వహించటం జరుగు తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ డే తరువాత ఎఫ్ఎల్సీ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, కేంద్ర , రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ కాస్ట్ ద్వారా చెకింగ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఎఫ్ఎల్సీ పకడ్బందీగా నిర్వహించ టానికి పూర్తి స్థాయిలో పటిష్ట ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. ఉద్యోగులు అత్యంత జాగ్రత్తగా వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి ఎఫ్ఎల్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో భాగంగా నిర్వహించే విజువల్, టెక్నికల్, ఫంక్షనరీ తనిఖీల గురించి జెసి రాజకుమారి వివరించారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, ఎఫ్ఎల్సీ ప్రత్యేక అధికారి ఉపాధి అధికారి రఘు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలు



కన్న స్కూల్లో..

స్థానిక ఆర్టీసి కాలనీలోని కన్నా పాఠశాలలో శుక్రవారం ముందస్తు దసర సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన మహిషాసుర మర్థిని నృత్యగీతం ఆకట్టుకుంది. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పండుగలు పెనవేసుకొని ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూజిత పబ్లిక్ స్కూల్లో...

స్థానిక పట్టాభిపురంలోని పూజిత స్కూల్లో నిర్వహించిన దసరా సంబరాల్లో విద్యార్థినులు నవదుర్గల వేషధారణ అలరించారు. విద్యార్థులు దసరా గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. బతుకమ్మ పాటలు, నృత్యాలతో సంబరాలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు నిండుగా కనిపించే పండుగ దసరా అని తెలియచేసి, పండుగ ప్రత్యేకతను వివరించారు.

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పలు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రాలు, నవదుర్గ వేషధారణలతో విద్యార్థులు ఈ వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పండుగలు, సాంప్రదాయాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నవదుర్గల వేషధారణ, నాట్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రిధినిచౌదరి, ఏఓ వెంకటరావు పాల్గొన్నారు.

గాయపడిన ఎఎన్‌ఎంకు పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి :ఇటీవల రోడ్డుప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఎఎన్ఎం పి.లక్ష్మిని ముగ్గురోడ్డులోని ఆమె నివాసంలో కలిసి సిపిఎం, సిఐటియు నాయకులు పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.లక్ష్మి, డి.వెంకటరెడ్డి, వేముల దుర్గారావు పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీల పెంపుపై నేడు ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారాలు వేస్తున్న విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మంగళగిరి మిద్ది సెంటర్లో ప్రజా బ్యాలెట్ నిర్వహించాలని శుక్రవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగిన వామపక్షాల సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపడానికి నిర్ణయించిందని వామపక్షాల నాయకులు విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తుందని విమర్శించారు. ఈనెల 19 తేదీన విద్యుత్ చార్జీల పెంపుపై మంగళగిరి సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ నాయకులు ఎం బాలాజీ, ఎస్ గణేష్, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, వై వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నెహ్రూ నికేతన్‌లో దసరా సంబరాలు

ప్రజాశక్తి-తెనాలి :స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పర్యవేక్షణలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు వివిధ రకాల వేషదారణల్లో అలరించారు. నూనత వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఈ సందర్భంగా మురళీకాంత్, గీతాకాంత్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. కోలాటం ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రైతులకు బహుమతి అందచేస్తున్న కంపెనీ ప్రతినిధులు

వేద ప్లాటినం పత్తిపంట ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు :క్రోసూరు మండలం, 88 తాళ్లూరులో వేద సీడ్స్ వారి హైబ్రిడ్ ప్రత్తి విత్తనం 'వేదప్లాటినం' బిజీ-క్ష్మీక్ష్మీ పంటను పొత్తూరి గోవిందరాజులు అనే రైతు పొలంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 750 మంది రైతులు హాజరై పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ మార్కెటింగ్ డిజిఎం దావులూరి నాగబాబు మాట్లాడుతూ వేద ప్లాటినం హైబ్రిడ్ ప్రతి విత్తనం అన్ని రకాల నేలలకు అనువైన వంగడం అని, గులాబీ పురుగు, దోమపోటు, ఇతర తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకొని అధిక దిగుబడిని ఇస్తుందన్నారు. ప్రత్తి తీయటానికి చాలా సులువైన విత్తనమని, ప్రతి చెట్టుకు 80 నుండి 100 కాయలు ఉంటాయన్నారు. ఎకరాకు 17 నుండి 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు కె. పెద్దిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, రవితేజ, డీలర్లు, ఏరియా మేనేజర్ జె.రమేష్, రీజనల్ మేనేజర్ తోట సుబ్రమణ్యం, నామా శ్రావణ్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

22న భవన నిర్మాణ కార్మిక సంఘం నగర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంజీవయ్య నగర్ హైస్కూల్ వద్ద 22వ తేదీన జరిగే గుంటూరు భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) తూర్పు కమిటీ మహాసభను జయప్రదం చేయాలని కే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహాసభను జయప్రదం చేయాలని శుక్రవారం పాత గుంటూరులోని బాలాజీ నగర్‌లో కార్మికులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, సంక్షేమ బోర్డులోని క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నగర నాయకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మికులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైల ముత్యాలరావు, టి మల్లేశ్వర రావు, తుమ్మల నాగరాజు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ చర్యతో ఇళ్లలోకి మురుగునీరు

ప్రజాశక్తి-తాడేపల్లి

కాంట్రాక్టర్ చర్యతో పేదల ఇళ్లలోకి మురుగునీరు చేరింది. తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలో వెంకయ్య కొట్టు టీ సెంటర్‌లో మున్సిపల్ కాంట్రాక్టర్ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించి మెటీరియల్‌ను రైల్వే స్థలంలోకి చేర్చారు. ఆ స్థలంలోకి చేర్చడానికి వాహనాల రాకపోకలకు వీలుగా డ్రైనేజీ కాలువను ఇసుక బస్తాలతో పూడ్చారు. ఫలితంగా కాలువలో నీరు వెనక్కి తన్ని పేదల ఇళ్లల్లోకి చేరాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు విషయం చెబుదామన్నా అందుబాటులోకి రావడంలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ పొంగి రోడ్డుపైకి మురుగు నీరు వచ్చి చేరుతుంది. ఒకపక్క పట్టణంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో మురుగునీరు ఇళ్లల్లోకి చేరడంతో పాటు ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో స్థానికులు అంటువ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌ను పిలిపించి మురుగు పారుదలకు అడ్డంగా వేసిన ఇసుక బస్తాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని , ఆ ప్రాంతంలో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లాలని స్థానికులు కోరు తున్నారు.

ఆశ వర్కర్ల మనోభావాలను గౌరవించాలి



మాట్లాడుతున్న శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆశ వర్కర్ల మనోభావాలను గౌరవించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు కోరారు. తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఆశ వర్కర్లు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి నాల్గో రోజుకు చేరుకుంది. ఆశ వర్కర్లు స్ఫూర్తిదాయకమైన పోరాటం నిర్వహించారని శివశంకర్ కొనియాడారు. ఆశాల పోరాటానికి రైతు సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. సిపిఎం రూరల్, పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, టిఎన్‌టియుసి, టిడిపి పట్టణ నాయకులు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు ఆశ వర్కర్లు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి, రేణుక, సుమతి, సుగుణ, వి.లక్ష్మి, కరుణ, వినోదిని, విజయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఎఎన్‌ఎంలు కూడా తమ మద్దతు తెలియజేశారు.

కెఎల్‌యులో యువ వ్యాపారులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఖాదీ గ్రామీణ మహోత్సవం సందర్భంగా కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఎంబిఎ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం, అభివృద్ధి గ్రామీణ అభివృద్ధితోనే ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖా డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్ పాల్గొన్నారు.

వివిఐటికి చేరుకున్న ఇండియన్ నేవి కారు యాత్ర

ప్రజాశక్తి-తెనాలి

ఇండియన్ నేవి డే సందర్భంగా తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారు ర్యాలీ శుక్రవారం వివా ది స్కూల్, వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరుకు చేరుకుంది. విశాఖపట్నం నుంచి కన్యాకుమారి వరకు 16 మంది నౌకదళ బృందంతో నిర్వహిస్తున్న ర్యాలీకి వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ స్వాగతం పలికారు. లెఫ్టినెంట్ కమాండర్ దీపక్ యాదవ్ విద్యార్థులకు నావికాదళం ప్రయోజనాలు, దానిలో ఉద్యోగ అవకాశాలు తదితరాలను వివరించారు. స్మార్ట్ ఫోన్‌లో భారత నౌకాదళం యాప్ ను డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలకు సంబంధించిన నోటిఫికేషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున్ రెడ్డి, వివా డైరెక్టర్ ఎల్ టి కమాండర్ కే శ్రీనివాసరావు, వివాది స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సరళ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

కన్యాకపరమేశ్వరి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరంలోని ఆర్.అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 15 నుండి 23 తేదీ వరకు 102వ దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తాడికొండ లీల వెంకట వీరాంజనేయులు, నేరెళ్ల వెంకట హరి ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. 23వ తేదీ సోమవారం విజయదశమి రోజున సాయంత్రం భారీ గ్రామోత్సవం వివిధ రాష్ట్రముల నుండి విచ్చేసిన కళాకారులచే వానాసంచ కాల్పులతో తిరువీధుల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. గుడిపాటి భాస్కర్,కోట శేషగిరి,మద్దాలి సుధాకర్, పానుగంటి పావని, జవ్వాది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'బంగారుతల్లి' కార్డులు అందజేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శంకర భారతిపురం హై స్కూల్ లో జరుగుతున్న బంగారుతల్లి పథకం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థినులకు 'బంగారు తల్లి' కార్డులను జారీ చేశారు. అందులో విద్యార్థుల వివరాలతో పాటు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, సరిగా నమోదు చేయలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివరాలను విద్యాశాఖ ద్వారా కాకుండా ఎఎన్ఎం ద్వారా నమోదు చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను టీచర్లతో చేయించాలన్నారు. డిఇఒ శ్యామ్యూల్, ఎంఇఒ ప్రభాకర్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పార్వతిలను ప్రశ్నించారు. విద్యార్థుల రిపోర్టులను సవ్యంగా తయారు చేయాలని సూచించారు. సమావేశంలో స్కూల్ హెచ్ఎం పార్వతి, తహశీల్దార్ రమణ నాయక్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఆహారంలో నాణ్యత తప్పనిసరి అని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ అన్నారు. గురజాల నియోజకవర్గంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ పర్యటించారు. చిన్నారులకు బంగారు తల్లి కార్డ్ పంపిణీ చేసి ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాడు- నేడు పనులు పరిశీలించారు. మధ్యాన భోజన పథకాన్ని పరిశీలించారు. స్థానిక అధికారులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురజాల తహశీల్దార్ కార్యాలయం నుంచి నేరుగా గవర్నమెంట్ గురజాల హై స్కూల్‌లో జరిగే నాడు - నేడు పనులు పరిశీలన చేశారు .అక్కడ జరుగుతున్న బంగారు తల్లి పథకం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు కార్డులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బంగారు తల్లి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించి బంగారు తల్లి కార్డులు పంపిణీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును



శంకర భారతిపురం హై స్కూల్ లో 'బంగారు తల్లి' కరపత్రాలను విద్యార్థినులతో కలిసి ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పాదర్తి శివకోటి ఆంజనేయులు చారిటబుల్ ట్రస్ట్ పాఠశాలకు నాలుగు ఫ్యాన్లు బహుకరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ,ఐసిడియస్ సూపర్ వైజర్ కె.శశిదేవి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ తవనం రామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక క్యాంప్-2 మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం బంగారు తల్లి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాచర్ల ఎంపీడీవో సరోజిని దేవి పాల్గొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హిమోగ్లోబిన్ పరీక్ష చేయించి పిల్లల హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకునేలా కృషి చేయాలని ఆమె అన్నారు. అనంతరం తల్లిదండ్రులచే విద్యార్థినులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించి బంగారుతల్లిగా ఎదగటానికి కృషి చేస్తానని వారితో ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాచర్ల డిప్యూటీ తహశీల్దార్ వాణి, ఎంఈవో అల్లి సురేష్, ఈవో కోటేశ్వర రావు, నాగులవరం సర్పంచ్ గోగిరెడ్డి వెంట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐ ఫణికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పాఠశాల హెచ్ఎం ఎ.మల్లిఖార్జున రావు,ఉపాధ్యాయులు ఎస్.కె. మౌలాలి పాల్గొన్నారు.



రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మాచర్ల

రక్తహీనత రాకుండా బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చినఏసోబు సూచించారు. స్థానిక జడ్‌పి బాలికల హైస్కూల్‌లో బాలిక ఆరోగ్యం-ప్రగతికి మార్గం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఇవి రమణబాబులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారాన్ని ప్రణాళిక ప్రకారం తీసుకోవాలన్నారు. ఐరన్ ఎక్కువగా లభించే గుడ్డు, పాలు, బెల్లంతో చేసిన పదార్ధాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఇతర జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ వేముల నాగయ్య, హెచ్ఎం ఉషారాణి, పల్చూరి నరసింహారావు పాల్గొన్నారు.



సత్యసాయి విద్యా విహార్‌లో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పట్టణంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్ పాఠశాలలో మాచర్ల పిఎస్ఆర్ మీనాక్షి ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్ధులకు శుక్రవారం ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. హాస్పిటల్ డాక్టర్ల బందం కౌశిక్, మార్క్, శ్రీను, ఆధ్వర్యంలో 150 మంది విద్యార్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కండ్లకు సంబంధించిన జాగ్రత్తలు వివరించారు. అవసరమైన వారికి మందులు కళ్ళజోళ్ళ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బంగా లక్ష్మీ ప్రసన్న, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాస రావు సాయి ఎడ్యుకేషనల్ సెక్రటరీ అక్కినేని అనిల్, పాఠశాల ప్రిన్సిపల్ వై.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మధుర వాణి, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బొర్రా అప్పారావు

'బీసీలను విడదీసే యత్నం తగదు'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

దేశ ఆర్థిక రంగానికి వెన్ను దన్నుగా వున్న బీసీలను కార్పొరేషన్లు పేరుతో వైసిపి ప్రభుత్వం విడదీసేందుకు ప్రయత్నిస్తుందని సత్తెనపల్లి నియోజకవర్గం జనసేన నాయకులు బొర్రా వెంకట అప్పారావు విమర్శించారు .సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల లో జనసేన నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా అప్పా రావు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం.. బీసీ కులగణన జరిపి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు దక్కాల్సిన అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కృష్ణా-పెన్నా రీజియన్ కోఆర్డినేటర్ పార్వతీనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు జనసేన నాయ కులు ఎన్.నాగేశ్వరరావు, టి.నర్సయ్య, టి.లక్ష్మి, ఎస్.పవన్, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ పాల్గొన్నారు.

రాయితీ పై శనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-వినుకొండ

శావల్యాపురం మండలం కారుమంచి గ్రామం లోని రైతు భరోసా కేంద్రం నందు రైతులకు ప్రభుత్వం ద్వారా రాయితీపై శనగల విత్తనాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ను నిర్మించి, రైతులకు కావాల్సిన ఎరువులను, విత్తనాలను అతి తక్కువ ధరలకే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 20 కిలోల బస్తా



రూ.1600 కాగా, రైతు భరోసా ద్వారా ప్రభుత్వం రాయితీ పై రూ.810 కే ఇస్తోందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేజర్లలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-నకరికల్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పదకాలను పారదర్శకంగా ప్రజలకు అందజేస్తున్నారని జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. చేజర్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా అంబటి రాంబాబు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వాలంటీర్ల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం. వెంకటేశ్వర రెడ్డి, మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పక్కాల సూరిబాబు,జే ఏ సి మండల కన్వీనర్ మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ బొట్లపాటి కష్ణకుమారి, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామోదయం/నగరోదయం పథకంలో భాగంగా బంగారు తల్లి పథకం సమగ్ర అమలుకు, మధ్యాహ్న భోజన పథకం పై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 10 నుంచి 19 ఏళ్ల బాలికలు, యువత వరకు ఎనీమియా బారినుండి రక్షణ పొందేందుకు, వారిలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించడమే బంగారు తల్లి పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి కళాశాలల స్థాయి వరకు అన్నిచోట్ల మహిళలను చైతన్య పరచడం, వారిలో పౌష్టి కాహారం అందించడం, తల్లిదండ్రులను ప్రోత్సహించి పిల్లలకు పౌష్టికాహారం అందించడం వంటి ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

ప్రజాశక్తి-వినుకొండ



స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యాక్ 12 ,13 తేదీలలో సంద ర్శించింది. ఈ త్రిసభ్య బృందానికి ఎస్ జి టి విశ్వ విద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ప్రొఫెసర్ షరీఫ్ అహ్మద్ చైర్ పర్సన్ గా, బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం లక్నోకు చెందిన చరిత్ర విభాగపు ఆచార్య ఎస్. విక్టర్ బాబు నెంబర్ గా మరియు ఎన్.కె.ఎస్ ఆదర్శ కళాశాల మహారాష్ట్ర ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ ధన నాటే మెంబర్‌గా వ్యవహరించారు. మొదటి రోజు గురువారం కళాశాలలోని వసతులను కళాశాల సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులను తల్లిదండ్రులను ,కళాశాల సిబ్బందితో విడివిడిగా సమావేశమై కళాశాల పనితీరుపై ఆరా తీశారు. సాయంత్రం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆద్యంతం వీక్షించారు. రెండవ రోజు శుక్రవారం కళాశాల సిబ్బందితో ముగింపు సమావేశాన్ని నిర్వహించి కళాశాల అభివృద్ధికి సూచనలు అందించారు. చివరిగా న్యాక్ బృందం తమ రిపోర్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు కు అందజేశారు. ఈ రిపోర్టు ఆధారంగా కళాశాలకు గ్రేడ్ నిర్ణయించబడుతుందని తెలియజేశారు.

కుల గణనతోనే ఓబిసిలకు న్యాయం

ప్రజాశక్తి-మాచర్ల

సమాజానికి కుల గణన ఎక్స్‌రే లాంటిదని, తద్వారా ఓబిసిలు, ఆదివాసులు, గిరిజనులు, దళితులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుల గణనపై జరుగుతున్న నిర్లక్ష్యం వలన ప్రభుత్వ వ్యవస్థలలో ఓబిసి, ఎస్‌సి, ఎస్‌టిల భాగస్వామ్యం తెలిసే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన కుల, గణన ఆధారంగా నేడు ప్రభుత్వ వ్యవస్థలు ఉన్నట్లు వివరించారు. 140 కోట్ల దేశ జనభాకు సంబంధించిన కుల గణనను రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వెంటనే కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ బాబు, నాగరాజు, రాగిడి ప్రతాప్‌బాబు, పుల్లారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సాగునీరు అందించి పంటలను కాపాడాలి

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్ర రైతాంగం కష్టాల్లో ఉందని సాగర్ జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన సాగుతుందని నాడు చంద్రబాబు నాయుడు గోదావరి నది జలాలను సాగర్ కుడి కాలువకు అనుసంధానం చేసే స్కీం చేపట్టగా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది అన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్షల క్యూసెక్కు గోదావరి జలాలు వధాగా సముద్ర పాలవుతున్నాయని అన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రాణాలకు ముప్పు ఉందని ఆయనకు ఏమైనా జరిగితే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని జీ.వీ ఆంజనేయులు హెచ్చరించారు. సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ అయుబ్ ఖాన్ టిడిపి నాయకులు రొడ్డా వీరాంజనేయరెడ్డి, పి.దాసయ్య, హనుమాన్ నాయక్ పాల్గొన్నారు.

సురక్ష క్యాంపులను వినియోగించుకోవాలి

- నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

సీజనల్ వ్యాధుల వలన ప్రజలకు ఎదురయ్యే అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా కార్పొరేటర్లు అవగాహన కల్గించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివద్ధి పనులు, స్థానిక సమస్యలపై మీట్ ది కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల ఆరోగ్య రక్షణకు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కార్పొరేటర్లు అవగాహన కల్గించాలని కోరారు.కొన్ని వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు నిర్దేశిత సమయం విధుల్లో ఉండట్లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, శానిటరీ సూపర్వైజర్లు, ఎంహెచ్ఓ ఆకస్మిక పర్యటనలు చేసి, విధుల్లో లేని కార్యదర్శులపై చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.

కాంట్రాక్టర్లతో స్పెషల్ గ్రీవెన్స్

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించామని, వర్క్ అగ్రిమెంట్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబందించి బిల్లుల ఆన్ లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్ లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.



కార్పొరేటర్ల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

చిలువూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండలంలోని చిలువూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొ న్నారు. మండలంలోని రెండు పిహె చ్‌సి సెంటర్లకు చెందిన డాక్టర్లతోపాటు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చెందిన డాక్టర్ ప్రభాకర్ శివ, డాక్టర్ తాజుద్దీన్, దుగ్గిరాల పీహెచ్‌సి డాక్టర్ అబ్దుల్ రెహమాన్ ప్రజలను పరీక్షించే ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంపీపీ డి సంతోష్ రూపవాణి జడ్పిటిసి ఎం అరుణ దుగ్గిరాల ఏఎంసీ చైర్మన్ షేక్ బాజీ తాసిల్దార్ కే మల్లేశ్వరి ఏర్పాట్లను చేశారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాకుమాను : కాకుమాను మండలంలో కాకుమాను, చిన లింగాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపివేయ బడుతుందని విద్యుత్ లైన్ ల మరమ్మతులు మరియు ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయబడుతుందని ఎఇ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం నిడుబ్రోలు గ్రామం లో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు 11కేవి మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకాని ఎస్ఎస్‌లో 11 కె.వి, వెనిగండ్ల ఫీడర్ మెయింటెనెన్స్, చెట్లు నరికే కార్యక్రమం వలన శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం గం.2ల వరకు పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెదకాకాని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

జిల్లా విజిలెన్స్ అధికారులు 5,442 సర్వీసులు తనిఖీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనికీలు నిర్వహించారు. తెనాలి డివిజన్ పరిధిలో ఆపరేషన్ సబ్ డివిజన్ టౌన్- డి1 సెక్షన్ పరిధిలో జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వి ఎల్ ఎన్ మూర్తి, తెనాలి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అపరేషన్స్ సబ్ డివిజన్ టౌన్ డిఇఇ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. అనధికార అదనపులోడులు, దొంగతనం, మాల్ ప్రాక్టీస్, మల్టిపుల్ సర్వీసుల కేసులపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి వినియోగదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ దుర్గారావు సహకారంతో జరిపిన తనిఖీల్లో డి1 పరిధిలో డిఇఇ, ఎడిఇ అలాగే ఇతర సిబ్బంది 64 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించినట్లు విద్యుత్ శాఖ తెలిపారు. పట్టణ పరిధిలో మొత్తం 5442 సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. వాటిలో అదనపు లోడులకు సంబంధించి 138 కేసులు నమోదుచేసి రూ 7 లక్షల 45 వేల అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. అలాగే మాల్ ప్రాక్టీస్ చౌర్యం ద్వారా 10 కేసుల్లో రూ 1 లక్ష 5 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. బ్లాక్ బిల్లింగ్ కేసులు 152 నమోదవ్వగా రూ 9 లక్షల 40 వేలు ఫైన్ విధించినట్లు డిఇఇ అశోక్ కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ శాఖ నిర్దేశించిన బిల్లులను 15 రోజుల కాలవ్యవధిలో బిల్లు మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా తెనాలి పట్టణం, రూరల్ పరిధిలో పలుచోట్ల శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్ సబ్ డివిజన్ టౌన్ డిఇఇ అశోక్ కుమార్ శుక్రువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నిచోట్ల ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

'ఉక్కుసత్యాగ్రహం' సినిమా లోగో ఆవిష్కరణ

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, దర్శకుడు సత్యారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాఖ ఉక్కు పరిరక్షణ నినాదంతో నూతనంగా నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం చిత్రం లోగో ఆవిష్కరణ గుంటూరులో ఘనంగా జరిగింది. హోటల్ గీతా రెసిడెన్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, దర్శకులు, నిర్మాత సత్యారెడ్డి, గాయకులు రమణ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు పోరాట చరిత్ర, విశాఖ ఉక్కు పరిరక్షణ నేపథ్యంలో ఉప్పు సత్యాగ్రహం చిత్రం నిర్మించడం జరిగిందని వారు వెల్లడించారు. అదేవిధంగా ఈ సినిమాలో నటించడం తోపాటు రెండు పాటలను కూడా యుద్ధ నౌక ప్రజా గాయకులు గద్దర్ రచించడం జరిగిందని వారు పేర్కొన్నారు. నవంబర్ లో ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. సినిమా విడుదల టైంలో మహా గాయకుడు గద్దర్ మన మధ్య లేకపోవడం బాధాకరమని వారు అన్నారు.అన్ని వర్గాలను ప్రత్యేకంగా ఈ చిత్రం ఆకర్షించడం జరుగుతుందని చెప్పారు. తప్పనిసరిగా ప్రేక్షకులంతా సినిమాని ఆదరించాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో భాగ స్వాములైన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులను కూడా చిత్రంలో భాగస్వామ్యం చేసినట్టు తెలిపారు.



పేద మహిళకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి పట్టణం లోని పాత మంగళగిరి చెందిన పేద మహిళ ఏ లీలావతికి మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సహకారంతో శుక్రవారం వైసీపీ నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎండి ఫిరోజ్, ఎం సుధారాణి, ఎస్ సునీత, ఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామంలో శుక్రవారం దోమలు నిర్మూలనకు సర్పంచ్ షేక్ అజీ జూన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. స్థానిక మార్టిన్ కాలనీలోని మురుగు కాలువలు గుంతలలో దోమల మందు పిచకారి చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి భవాని షేక్ జానీ భాష ఎం నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నారైలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- మేడికొండూరు

ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ , జీవన నైపుణ్యాల పై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో రోజురోజుకీ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నూతన ఆలోచన విధానాలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని అన్నారు. చదువును కూడా ఇష్టంతో కష్టపడి చదవటం నేర్చుకోవాలన్నారు. కృషి పట్టుదలతో ఏ పని చేసినా మంచి విజయాలు దరిచేరతాయని తెలిపారు. ప్రస్తుత విద్యా రంగంలో పోటీ కొనసాగుతుందని విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి గోలి లక్ష్మయ్య, డాక్టర్ ఏ వీర రాఘవరావు, రాంబాబు, కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసు, విభాగాల హెచ్ ఓ డి లు చంద్రమౌళి, రెహమాన్, రాము, కోటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి పేదవాడికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యం, ఆరోగ్యం , నాడు నేడు అనే అంశంపై ఎ.పి.ఎడిటర్స్ అసోసియేషన్, బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. బాప్ కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నవరత్నాలు పథకం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకం రెడ్డి నాగ నారాయణ మూర్తి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య విభాగానికి ఇప్పటికే ఎనిమిది జాతీయ అవార్డులతో పాటు రెండు గ్లోబల్ డిజిటల్ అవార్డులు వచ్చాయన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ గత నాలుగేళ్ళగా వైద్య రంగంలో 53,200 ఉద్యోగాలను భర్తీ చేసిందని, దేశంలో మొదటి సారిగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా స్పెషలిస్టుల సేవలు అందుతున్నాయన్నారు. పిహెచ్‌సిల్లో 40 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, 200 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 14 రకాల పరీక్షలు చేస్తున్నారని, 105 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా 3200 రకాల రుగ్మతలకు చికిత్సలు అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కష్ణంరాజు, విక్టోరియా ఫార్మశీ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య,మానవతా సంస్థ కన్వీనర్ సలీంమాలిక్, వైసిపి డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్, కోస్టల్ కేర్ ఆస్పత్రి సి.ఇ.వో. డాక్టర్ జాన్‌బాబు, సాయి భాస్కర్ ఆస్పత్రుల నిర్వాహకుడు బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి హైకోర్టు అడ్వకేట్ పి. ప్రభాకర రెడ్డి ప్రసంగించారు.



పేరేచర్లలో 'బోరు' ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల గ్రామ పంచాయతీ సమీపం లోని జండా చెట్టు వద్ద నూతన బోర్వెల్ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమము శుక్రవారం జరిగింది. మండల పరిషత్ నిధులలో నుండి రూ.లక్షతో ఈ బోర్వెల్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ మన్నవ స్వప్న తెలిపింది.

ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ తాగునీరు కొరతగా ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజల కనీస వసతులు తాగునీరు, రోడ్లు కొరకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ రావు, ఈవో పి ఆర్ డి పి రవికుమార్ ,పంచాయతి సెక్రటరీ ఎంబీఏ రెహమాన్ భాష పాల్గొన్నారు.

వికలాంగునికి వీల్‌చైర్ బహూకరణ

ప్రజాశక్తి- తెనాలి : పట్టణానికి చెందిన తెనాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుడైన ఉయ్యూరు శ్రీకాంత్ కు ఎలక్ట్రికల్ వీల్ చైర్ను బహుకరించారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ క్రికెటర్ అంబటి రాయుడు సహకారంతో వీల్ చైర్ బహూకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబటి రాయుడు పర్సనల్ అసిస్టెంట్ రాహుల్, శాసనసభ్యుల పిఎ సునీల్, అచ్యుత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

టిడిపి 'భవిష్యత్తుకు భరోసా'

ప్రజాశక్తి - దుగ్గిరాల

టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు భరోసా కార్యక్రమంలో శుక్రవారం మండలంలోని చిలువూరు గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తోటకూర సీతారామయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. 2024 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితే చేపట్టే పథకాలు కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి ప్రజలకు తెలియజేశారు. అధిక ధరలు ఇసుక కొరత కరెంటు చార్జీలు అద్వానంగా ఉన్న రహదారులు తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో వెలివేల అవినాష్ ఆలపాటి జానకి బండ్లమూడి శైలజ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుండి పాఠశాలలకు దసరా సెలవులు

ప్రజాశక్తి-గుంటూరు : అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నేటి నుండి ఈనెల 24వ తేదీ వరకూ దసరా సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు మాత్రం ఈనెల 21 నుండి 24వ తేదీ వరకూ సెలువులు ప్రకటించారు. ఈ సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లో తరగతులు నిర్వహించకూడదని, తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా లోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యా శాఖ అధికారులు, వారి పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు దసరా సెలువుల్లో తరగతులు నిర్వహించకుండా పర్యవేక్షించాలని తెలిపారు.

సాధారణ చార్జీలతోనే దసరా ప్రయాణం

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగుళూరు మహా నగరాల నుండి గుంటూరు జిల్లాలోని ఐదు బస్ స్టేషన్లకు ఈనెల 18 నుండి 23వ తేదీ వరకూ ప్రతిరోజూ ప్రత్యేక బస్సులు నడపటానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ చార్జీలతోనే ఈ ప్రత్యేక సర్వీసులకూ ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుండి 83, చెన్నై, బెంగుళూరు నుండి 3 చొప్పున, తిరుపతి నుండి 5 సర్వీసులు మొత్తం 94 సర్వీసులు నపడు తున్నట్లు ఆయన తెలిపారు. కావున ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించు కోవాలని కోరారు.

పోటీ పరీక్షలకు వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు :గ్రూప్-1,2 టీచర్ పోస్టులకు, పోటీ పరీక్షలకు వయోపరిమితి మరో 5 సంవత్సరాలు పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోటీ పరీక్షలకు వయోపరిమితిని గతంలో ఉన్న విధంగానే రెన్యువల్ చేస్తూ నూతన జి.ఓ ని తీసుకువచ్చిందన్నారు. ఈ జి.ఓ ఉద్యోగాల కోసం ఎంతో వ్యయ ప్రాయాసలకోర్చి సిద్ధమవుతున్న అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో 2019వ సంవత్సరం నుండి గ్రూప్-1, 2, డీఎస్సీ పోస్టుల కోసం లక్షలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని, గత నాలుగేళ్ల నుండి నోటిఫికేషన్ లేవన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ వల్ల ఉద్యోగాలకు దూరం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, నాలుగేళ్లలో ఒక్కసారే ప్రకటించారని, అది కూడా జాబ్‌లెస్ క్యాలెండర్ అని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, వయో పరిమితి పెంచాలని, లేనిఎడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఖోఖో జట్టుకు పెనుమాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పేరెంట్స్ కమిటీ చైర్మన్, హెచ్ఎం తదితరులు

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పెనుమాక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు వి.పూర్ణ చంద్రశేఖర్ తెలియ జేశారు. శుక్రవారం ఆయా విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె. సుబాని, గ్రామ పెద్ద బి.ప్రసన్న కుమార్, హెచ్ఎం పూర్ణచంద్రశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 12న నిడమర్రు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా టోర్నమెంట్, జిల్లా జట్టు ఎంపికల్లో అండర్-14, అండర్-17 ఖోఖోలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అండర్ -14 విభాగంలో జె.సిరిచందన, టి.ఏలియా, అండర్-17 విభాగంలో యం.మధు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్‌బాబు, ఎన్.హరికృష్ణను అభినందించారు.

మలినేనిలో ముగిసిన హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు :మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో ఐదు రోజుపాటు ఐడియా ల్యాబ్స్ ఫ్యూచర్‌టెక్ వెంచర్స్ వారి ఆధ్వర్యంలో బ్లాక్ చైన్ టెక్నాలజీపై నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీహబ్ వ్యవస్థాపకులు విజయ్ బవారా, రైజర్ కంపెనీ వ్యవస్థాపకులు జి.సూర్య, ఐడి ల్యాబ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు పంకజ్ దివాన్, ఒరాకిల్ క్లౌడ్ సర్వీసు కంపెనీ డైరెక్టర్ అలోక్ తివారి, బిజినెస్ కన్సల్టింగ్ స్మార్ట్‌టైల్ ఏఐ కంపెనీ చైర్మన్ షీతల్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలోక్ తివారీ మాట్లాడుతూ మలినేని విద్యాసంస్థలో బూట్ క్యాంప్‌లు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ, కార్పొరేట్ సంస్థల కొలువులు పొందేటట్టు చేస్తుందని అన్నారు. మలినేని విద్యాసంస్థల అధినేత డాక్టర్ యం.పెరుమాళ్లు మాట్లాడుతూ మలినేని విద్యార్థులు చదువుతోపాటు కళాశాల నిర్వహించే హ్యాక్‌థాన్ ప్రోగ్రామ్‌లో ఇతర నైపుణ్యాలలో ప్రావిణ్యత సంపాదించుకోవచ్చని, వినూత్న ఆలోచనలతో కొత్తగా కంపెనీలను నెలకొల్పి ఇతరులకు ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సరికొత్త రూపకల్పనలు చేసిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్‌లు డాక్టర్ జె.కిషోర్‌బాబు, డాక్టర్ పి.రమేష్ బాబు, ఐక్యాంప్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.గౌతమి, ఐటి విభాగాధిపతి డాక్టర్ కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

బిజెపి పాలన చీకటి యుగం

న్యూస్‌క్లిక్‌పై దాడికి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు



నిరసన తెలియచేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

న్యూస్‌క్లిక్‌పై కేంద్రం ప్రభుత్వం దాడిని నిరశిస్తూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని న్యూస్‌క్లిక్‌పై దాడిని ఖండించారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె.నళినీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యవక్తగా పాల్గొన్నారు.గత 45 సంవత్సరాలుగా ప్రభీర్ పురకాయస్త ఇదే వృత్తిలో ఉన్నారని, ఎప్పుడూ లేనిది ఇప్పుడెందుకు ఆయన కేంద్రానికి శత్రువు అయ్యారో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆయన వార్తలు రాసి జైలుకు వెళ్లారన్నారు. న్యూస్‌క్లిక్ ఇతర స్వతంత్ర జర్నలిస్టులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులపై దాడులకు పాల్పడుతున్న ప్రస్తుత బిజెపి పాలన కూడా ఎమర్జెన్సీని తలపిస్తుందని విమర్శించారు. ప్రశ్నించటమే నేరమైతే దేశంలో కోట్లాది మందిని అరెస్ట్ చేయాల్సి ఉంటుందని, బిజెపి ఆ ధైర్యం ఉందా అన్నారు. మీడియాను తన గుప్పిట్లో పెట్టుకోవాలని కేంద్రం భావిస్తుందని, ప్రశ్నించే వారిపై దాడి చేస్తుందన్నారు. ఇదే విధానాలు అనుసరిస్తే ఇందిరా గాంధీ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు హనుమంతరెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాస్తవ, పారదర్శక పాత్రికేతనం, అన్యాయాలను ఎదిరించే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధింపులకు పాల్పడుతుందని విమర్శించారు. ఉపాచట్టం ద్వారా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా ఏళ్ల తరబడి సామాజిక కార్యకర్తలను జైళ్లలో పెడుతున్నారన్నారు. ఈ అప్రజస్వామిక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నళినీకాంత్ మాట్లాడుతూ న్యూస్ క్లిక్‌పై రెండేళ్ల క్రితం నుండి కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, అయితే ఆ సంస్థపై చేసిన ఆరోపణలు ఏవీ కోర్టులో నిరూపితం కాలేదన్నారు. రైతు ఉద్యమం, సిఎఎ, ఎన్ఆర్‌సి తదితర ఉద్యమాల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వార్తలు రాసినందుకే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. తక్షణమే అరెస్ట్ చేసిన న్యూస్‌క్లిక్ సిబ్బందిని బేషరతుగా విడుదల చేసి, కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వివికె సురేష్, ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జి శంకర్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, జర్నలిస్టు రామకృష్ణ, విల్సన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఐలు నాయకులు శేషగిరిరావు, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, సిఐటియు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు నిరసన తెలిపారు.

జాతీయ స్థాయిలో అత్తోట విద్యార్థి ప్రతిభ

గోవర్ధన రూపొందించిన బైసైకిల్ అంబులెన్స్ రాష్ట్ర పతి భవన్‌లో ప్రదర్శన

ప్రజాశక్తి-కొల్లిపర



గోవర్ధన నాయుడు తయారు చేసిన బైసైకిల్

న్యూఢిల్లీలో అక్టోబర్ 9 10 11 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి 10వ ఇన్‌స్పైర్ మనక్ వైద్య విజ్ఞాన ప్రదర్శనలో కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అద్దంకి గోవర్ధన్ నాయుడు రూపొందించిన బైసైకిల్ అంబులెన్స్ ప్రాజెక్టు అర్హత సాధించి రాష్ట్రపతి భవన్లో ప్రదర్శనకు ఎంపికైనట్లు డిఇఒ శైలజ తెలిపారు. ప్రాజెక్టు రూపకల్పన గురించి విద్యార్థి గోవర్ధన్ నాయుడు వివరించాడు. అంబులెన్స్ వెళ్లలేని అటవీ కొండ ప్రాంతాల నుంచి గర్భిణులను, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను త్వరగా ఆసుపత్రి చేర్చేందుకు ఈ బైసైకిల్ అంబులెన్స్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ అంబులెన్స్ స్ట్రక్చర్‌కు ప్రత్యేకంగా రూపొందించిన రెండు చక్రాలను తగిలించారు. దీనిని సైకిల్‌కి తగిలించి ఆసుపత్రికి త్వరగా వెళ్లవచ్చని దీనిలో ప్రథమ చికిత్స అందించే కిట్‌తో పాటు ఆక్సిల్ సిలిండర్ సోలార్ విద్యుత్‌తో పనిచేసే ఫ్యాను లైట్ సైరన్ ఉంటాయని తెలిపాడు. రూ.పదివేలు ఖర్చుతో ఈ అంబులెన్స్‌ను రూపొందించవచ్చునని ప్రభుత్వము ప్రోత్సాహం అందిస్తే బైసైకిల్ అంబులెన్న్సను తయారు చేసి గిరిజన ప్రాంతాలకు అందించవచ్చునని గోవర్ధన్ తెలిపాడు. బైసైకిల్ అంబులెన్స్ తయారీ విధానాన్ని ప్రశంసిస్తూ కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ప్రశంసా పత్రాన్ని అందజేశారని, జపాన్‌లో జరిగే సైన్సు ఎగ్జిబిషన్ ప్రదర్శనలో పాల్గొనేందుకు తన ప్రాజెక్ట్ ఎంపికైనట్లు గోవర్ధన్ నాయుడు తెలిపాడు. ప్రస్తుతం నూజివీడు త్రిబుల్ ఐటీ లో ఇంటర్ చదువుతున్న గోవర్ధన్ జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు డిఇఒ పి శైలజ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, గ్రామస్తులు అభినందించారు.

విజయవాడ ఎంబివికెలో

నేడు 'విద్యా రంగం'పై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజా వికాస వేదిక ఆధ్వర్యాన శనివారం ఉదయం 10 గంటలకు 'విద్యా రంగం'పై రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని వేదిక బాధ్యులు ఎస్.పి.రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియం (ఎసి) హాలులో సోషల్ సైన్సెస్ ట్రస్ట్ బాధ్యులు ఎ.జగన్నాధరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సు రెండు సెషన్లుగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్, విశాఖపట్నం గీతం యూని వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.చిన్నయసూరి సదస్సును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం జరిగే మొదటి సెషన్లో 'ఉన్నత విద్యా రంగం - స్థితి గతులు' అంశంపై పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్. లక్ష్మణరావు, 'పాఠ్యప్రణాళిక - పాఠశాల విద్య' అంశంపై ఎపి విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్, 'పాఠశాల విద్య - స్థితిగతులు' అంశంపై మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడతారని తెలి పారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్య రెండో సెషన్లో 'పాఠశాల విద్య - బోధనా సమస్యలు' అంశంపై మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి, 'పాఠశాల విద్య - భాషా విధానం' అంశంపై విద్యా సంస్కరణోద్యమ కార్యకర్త డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, 'విద్య - ఫిస్కల్ పాలసీ' అంశంపై ప్రొఫెసర్ ఎం.సురేష్‌బాబు మాట్లాడతారని రామరాజు తెలిపారు.

వరల్డ్ టాప్ సైంటిస్టులలో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన 7గురు అధ్యాపకులు వరల్డ్ టాప్ 2 శాతం సైంటిస్ట్‌లలో చోటు సాధించారని విజ్ఞాన్స్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకు ప్రొఫెసర్ అంబటి రంగారావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ పీటే కె.అబ్రహం, మెకానికల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ కె.వెంకటరావ్, డాక్టర్ కే.బాలమురుగన్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ రుద్రపాల్ మిథున్, కెమికల్ విభానికి చెందిన ప్రొఫెసర్ టీ.సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2శాతం సైంటిస్ట్‌లలో నిలిచారన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 2022 సంవత్సరం వరకు ఉన్న ఉత్తమ సైంటిస్టుల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 22 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించారన్నారు. అందులో భాగంగా రీసెర్చ్ వర్క్, రీసెర్చ్ పబ్లికేషన్స్, హెచ్ ఇండెక్స్, సైటేషన్స్, రీసెంట్ పబ్లికేషన్స్, ఇతరత్రా పబ్లికేషన్స్‌లలో ఈ 7 అధ్యాపకులు ప్రచురించిన పేపర్లన్నింటిని కూడా పరిగణలోనికి తీసుకుని వరల్డ్ టాప్ సైంటిస్ట్‌లలో గుర్తించారని వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 7గురు ప్రొఫెసర్‌లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



అధ్యాపకులతో డాక్టర్ లావు రత్తయ్య